కథ

# ఆప్త మిత్రుడు

కోలపల్లి ఈశ్వర్

“ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య తప్ప నాకు మరో మార్గం ఏదీ కనిపించటం లేదురా ” అన్నాన్నేను పవన్‌తో.

వాడినేదో బెదిరిద్దామని కాదు. నిజంగానే నా పరిస్థితులు అలా తగలడ్డాయి. ఎటుచూసినా అప్పులే! పీకల్దాకా కూరుకుపోయాను. ఒక్క క్షణం కూడా నన్ను ప్రశాంతంగా ఉండనివ్వటం లేదెవ్వరూ.

ఎప్పుడెవరొస్తారో తెలీదు. ఎక్కడెవడు పట్టుకుంటాడో తెలీదు. ఇంట్లో ఉండాలంటే భయం. రోడ్డుమీదకి వెళ్లాలంటే చెప్పలేని భయం. ఆఫీసులో ఉన్నా భయమే. నా పాలిటికి యముళ్లు ఒకళ్లా ఇద్దరా! యమభటుల్లా వెంటాడుతున్నారు. మాయదారి లాటరీల వ్యామోహంలో పడి అందిన చోటల్లా అప్పులు చేసేశాను. లాటరీలంటే రూపాయికో, రెండు రూపాయలకో లక్షో యాభై వేలో వచ్చే ఆర్డినరీ లాటరీలు కాదు. టిక్కెట్ కొన్న పది నిముషాల్లో అదృష్టం బాగుంటే పెట్టుబడి ఎనిమిది రెట్లయిపోయే సింగిల్ నెంబర్ లాటరీలు.

ఎన్ని అప్పులు చేశానో నాకే తెలియదు.

గద్దె దిగిపోయిన గత ప్రభుత్వం ఒకే ఒక్క ఆర్డినెన్స్‌తో ఆ సింగిల్ నెంబర్ లాటరీలను కాస్తా రద్దు చేసేసింది. ఇప్పుడా లాటరీలైతే లేవుగానీ, వాటివల్ల నా తలకు చుట్టుకున్న అప్పులు మాత్రం అలాగే మిగిలిపోయాయి.

ఇన్నాళ్లూ అయితే ఏదో ఒక రోజు సుడి తిరక్కపోతుందా ఈ అప్పులన్నీ తీర్చెయ్యలేకపోతానా అని ఒకింత నిబ్బరంగా ఉండగలిగేవాడ్ని. కానీ ఇప్పుడలాంటి ఆశ కూడా లేదు. ఎక్కడ పారేసుకున్న దాన్ని అక్కడే వెతుక్కోవాలంటారు పెద్దలు. కానీ ఇప్పుడా ఆస్కారం ఎక్కడుంది? సింగిల్ నెంబర్ లాటరీలని టోటల్‌గా బ్యాన్ చేసేశారాయె.

నాకొచ్చే జీతం నెలకి మూడు వేలు. ఉన్న అప్పులేమో దాదాపుగా లక్షన్నర. వచ్చే జీతంతో ఇల్లే గడపనా, ఆ అప్పులే తీర్చనా?

ఎంతమందికని సమాధానం చెప్పగలను? ఎంత మందినని సముదాయించగలను?

తీర్చలేని వాడివి ఎందుకు తీసుకున్నావురా? అంటూ ప్రతి అడ్డమైనవాడూ తిట్టిపొయ్యడమే!

ఎన్నాళ్లు?

ఎన్నాళ్లని భరించగలనీ బాధల్ని?

అందుకే నేనలా అన్నాను పవన్‌తో.

పవన్ ఒకప్పుడు నా క్లాస్‌మేట్. ఏదో పని మీద వరంగల్ వచ్చి అనుకోకుండా నాకు తారసిల్లాడు చాలా ఏళ్ల తర్వాత.

హైదరాబాద్‌లో అతనికి పత్రికాఫీసులో ఉద్యోగమట. పెళ్లయ్యిందట. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారట. ఒక బాబు, ఒక పాప.

తన విశేషాలన్నీ చెప్పి వాడు నా గురించి అడిగేసరికి నేను నా బాధలన్నీ వాడితో ఏకరువు పెట్టి ఆఖర్న అన్నానలా.

“ఊరికే అలా అంటున్నావా. లేక నిజంగానే ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశావా?” పవన్ కూల్‌గా అడిగాడు.

“ఇంచుమించు ఒక నిశ్చయానికి వచ్చేసినట్టే!” అన్నాన్నేను. తనేవంటాడో చూద్దామనిపించింది.

“ముహూర్తం ఎప్పుడు పెట్టుకున్నావ్?”

“ఇంకా లేదు. ఓ వారం పది రోజుల్లో పెట్టుకుంటాను” అన్నాను. ఒళ్లు మండిపోతోంది నాకు వాడలా వ్యంగ్యంగా మాట్లాడుతుంటే!

సహాయం చేయలేకపోతే చేయలేకపోవచ్చు. కానీ అయ్యో పాపం అని జాలి పడచ్చు కదా! నాలుగు సానుభూతి మాటలు చెప్పొచ్చు కదా! అలాంటివేం లేకపోగా ‘ముహూర్తం ఎప్పుడు పెట్టుకున్నావ్?’ అని ఎద్దేవా చేసినట్లుగా అడుగుతుంటే వాడిని ఎలాంటి మనిషనుకోవాలి?

“అయితే ఇంకా ఓ వారం పది రోజులు టైముందన్నమాట! ఇంతకూ ఆత్మహత్య ఎలా చేసుకోవాలనుకుంటున్నావ్? ఐ మీన్ ఏ పద్ధతిలో చేసుకోవాలనుకుంటున్నావ్?” అడిగాడు పవన్.

‘ఓరి నీ క్రూరత్వం తగలబడిపోనూ’ అని మనసులో అనుకుని “ఉరిపోసుకోవాలనుకుంటున్నాను” అన్నాను పైకి కసిగా.

క్రూరత్వం కాకపోతే మరేమిటి? చిన్ననాటి స్నేహితుడు కదా అలా అడగొచ్చా?

“నా మాటలు నీకు కొద్దిగా బాధ కలిగిస్తున్నాయనుకుంటాను. అవునా?” అన్నాడు నాకేసి అదోలా చూస్తూ పవన్.

‘కొద్దిగా కాదు చాలా’ అని అనాలనిపించింది గానీ ఎందుకో మానేశాను. “బాధ దేనికి? నా చావేదో నేను ఛస్తాలేగానీ ఇంక వెళ్లి రానా?” అన్నాను. నా ప్రమేయం లేకుండానే నా ముఖం అప్రసన్నంగా మారిపోయింది.

“అదేంటి? ఇన్నాళ్లకు కలుసుకున్నాం కదా? ఒక పూట మీ ఇంటికి తీసుకెళ్లి నాకు ఆతిథ్యమైనా ఇవ్వవా ఏంటి?” అన్నాడు చిన్నగా నవ్వుతూ.

‘నీ మొహానికి ఆతిథ్యం ఒక్కటే తక్కువ’ అనుకుని “నీకు ఆతిథ్యం ఇచ్చేంత గొప్పవాడ్ని కాదులే..” అన్నాను పైకి.

“ఆతిథ్యం ఇవ్వడానికి గొప్ప వాడివే అయ్యుండాలా? ప్రేమతో గుక్కెడు మంచినీళ్లిచ్చినా చాలు. అదే గొప్ప ఆతిథ్యం. పద పోదాం మీ ఇంటికి” అన్నాడు జలగలా పట్టుకుంటూ పవన్.

వచ్చి ఏం ఉద్ధరిద్దామనో?

ఎంత లేదన్నా ఒకప్పటి స్నేహితుడు. వాడు నోరు తెరిచి ఇంటికి వస్తానంటుంటే కాదనలేకపోయా.

“సరే నడువైతే. కానీ ఒక్క మాట. నువ్వన్నట్టు ఆ గుక్కెడు మంచినీళ్లు మాత్రమే ఇవ్వగలను నేను”

“ఫర్వాలేదు. అదే పాయసం అనుకుంటా..పద” అంటూ నన్ను అనుసరించాడు.

ఒక రకంగా చెప్పాలంటే మేము కేవలం క్లాస్‌మేట్స్ మాత్రమే కాము. ఆ రోజుల్లో ఇద్దరం చాలా స్నేహంగా ఉండేవాళ్లం. నేను వంట చేసుకుంటూ ఓ రూంలో ఉండేవాడ్ని. పవనేమో హాస్టల్లో ఉండేవాడు. వారానికి మూడు నాలుగుసార్లయినా నా రూమ్‌కొచ్చి నేను వండుకున్నదాన్లో సగం తినేస్తుండేవాడు ‘ఆ హాస్టల్‌లో కూడు తినలేకపోతున్నా’ అంటూ. అలాగే వారానికి రెండు సినిమాలైనా కలిసి చూస్తుండేవాళ్లం.

అలాంటిది ఆ స్నేహాన్నంతా మర్చిపోయి, నా ఆత్మహత్య ప్రపోజల్ గురించి అంత అవహేళనగా మాట్లాడగలుగుతున్నాడంటే నిజంగా వాడేం మనిషి?!

దార్లో నా ఆత్మహత్య గురించి ఇంకేం మాట్లాడలేదు వాడు. తన గురించే చెప్పుకుంటూ వచ్చాడు.

చదివింది బియెస్సీ అయినా చేస్తున్నది ఆ చదువుతో ఏమాత్రం సంబంధం లేని ఆర్టిస్ట్ ఉద్యోగం. చిన్నప్పుడు ఏదో హాబీగా బొమ్మలు గీయటం ప్రాక్టీస్ చేస్తే ఇప్పుడదే అతనికి బ్రతుకుతెరువు అయ్యింది. వాళ్లావిడ కూడా ఏదో ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. ఒకరి జీతంతో ఇల్లు గడిచిపోతుంటే ఇంకొకరి జీతం సేవ్ చేస్తూ బాగానే బ్రతుకున్నారు. త్వరలోనే సిటీలో ఓ ఇల్లు కూడా కట్టించే యోచనలో ఉన్నాడు... ఇవీ వాడు చెప్పుకొచ్చిన గొప్పలు.


పెద్దగా ఆసక్తి లేకపోయినా ఏదో చెబుతున్నాడు కదాని నేను ఊ కొడుతూ వచ్చాను. వాడలా గొప్పలు చెప్పడంలో కూడా నాకు శాడిజమే కనిపించింది. ‘నువ్వంటే ఇలా చితికిపోయావ్ గానీ నేను చూశావా ఎంత హాయిగా ఉంటున్నానో’ అని నన్ను ఉడికించటానికే వాడలా అవన్నీ చెప్పుకొచ్చినట్టుగా అనిపించింది.

ఇల్లు చేరుకున్నాక ఎలాగూ వచ్చాడు కదాని మంచినీళ్లతో సరిపెట్టకుండా ఓ కప్పుడు కాఫీ వాడి మొహాన్న పోశాను. నా భార్యనీ, పిల్లల్నీ పరిచయం చేశాను. చిరిగిపోయిన బట్టల్లో ఉన్న వాళ్ల అవతారాలూ అవీ చూసి కనీసం ఓ పోర్టబుల్ టీవీ అయినా లేని మా ఇంటినీ, వాతావరణాన్ని చూసి వాడు చాలా జాలిపడ్డట్టుగా అనిపించింది. అంటే పైకేదో అన్నాడని కాదు గానీ, వాడి చూపులూ అవీ అలా అనిపించాయి నాకు.

ఓ అరగంట ఆ కబురూ, ఈ కబురూ చెప్పి "నేనింకా ఇక్కడే ఓ రెండ్రోజులు ఉంటాన్రా. వచ్చిన పనింకా పూర్తికాలేదు. నేను ఎల్లుండి ఈవెనింగ్ వచ్చి నిన్ను మళ్లీ కలుస్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు వాడు.

ఎల్లుండి మళ్లీ రావటం దేనికో?

నేను ముక్తసరిగా 'ఊ' అనేసి ఊరుకున్నాను. మాటవరసక్కూడా భోజనానికి ఉండమని అడగలేదు నేను.



"వస్తానమ్మా. మళ్లీ ఎల్లుండి వస్తా...వస్తాన్రా పిల్లలూ..." అని నా భార్యా పిల్లలకు కూడా చెప్పి వాడు వెళ్లిపోయాడు.

"భోజనానికి ఉండమనాల్సిందంట. ఏమనుకున్నారో ఏమో?" అంది నా భార్య వాడు వెళ్లిపోయాక.

"రాముడికి వడపప్పు లేదు గానీ హనుమంతుడికి తిరునాళ్లు చేయమన్నాట్ట వెనకటికెవడో నీలాంటి వాడు. అలా ఉంది నీ వాలకం. మనకే లేదు ఇంక వాడికేం పెడతాం" అనేసి వెళ్లిపోయాన్నేను.

★ ★ ★

అన్నట్టుగానే మూడో నాడు మళ్లీ ఊడిపడ్డాడు పవన్.

వాడొచ్చేసరికి ఇంట్లో నేనొక్కడినే ఉన్నాను.

నా భార్యా పిల్లలూ సాయిబాబా గుడికి వెళ్లారు. చెప్పొద్దూ అక్కడ ప్రతి గురువారం ప్రసాదాలు దండిగా పెడతారు.

"అమ్మాయీ, పిల్లలూ లేరా?" అన్నాడు వస్తూనే.

"లేరు. గుడికెళ్లారు" అన్నాన్నేను పొడిగా.

"అదీ ఒకందుకు మంచిదేలే" అంటూ బ్రీఫ్ కేస్ లోంచి ఏవో నాలుగు కాగితాలు బైటికి తీశాడు.

"ఏంటవి?" అడిగాన్నేను కుతూహలంగా.

"బొమ్మలు...ఇదుగో...ఇదే నీ శవం" అంటూ ఓ బొమ్మని నాకు అందించాడు.

ఆ బొమ్మలో ఉన్నది నిజంగా నా శవమే!

ఉరిపోసుకుని దూలానికి వ్రేలాడుతూ...నాలుకా గుడ్లూ బయటికొచ్చి - అబ్బ ఎంత భయంకరంగా ఉందో.

నేనేదో అనబోతుంటే నాకా అవకాశం ఇవ్వకుండా - "ఇదిగో ఇది నీ భార్యాపిల్లలు నీ శవం దగ్గర కూర్చుని ఏడుస్తున్న దృశ్యం" అంటూ ఇంకో బొమ్మని నా చేతిలో పెట్టాడు.

నా శవం మీద పడి హృదయ విదారకంగా ఏడుస్తున్నారు నా భార్య, పిల్లలూ. చూస్తుంటే అప్రయత్నంగా నా కళ్లు చెమ్మగిల్లాయ్.

"ఇదిగో...ఇది... నువ్ పోయాక వితంతువు రూపంలో ఉన్న నీ భార్య" పవన్ మరో బొమ్మనందించాడు.

మౌనంగా అందుకుని చూశాను.

అందులో ఉన్నది నా భార్య కౌసల్యే. తెల్లచీరలో ఉంది. నుదుట బొట్టు లేదు. మెడలో మంగళసూత్రం లేదు. ముఖం నిండా దైన్యం...చూడలేక కళ్లు మూసేసుకున్నాను.

"ఇదుగో...ఇది ఆఖరి బొమ్మ. నీ మరణానంతరం ఆకలికి తట్టుకోలేక బస్టాండులో నీ పిల్లలు ముష్టెత్తుకుంటున్న బొమ్మ"



నిజమే! వాళ్లు నా పిల్లలే. ఒంటి మీద చిన్న చిన్న లాగూలు మాత్రమే ఉన్నాయ్. చేతిలో సత్తుగిన్నెలు పట్టుకుని అడుక్కుంటున్నారు. వాళ్ల చూపులు దిగులుగా ఉన్నాయ్.

చూడలేక నేను మళ్లీ కళ్లు మూసేసుకున్నాను.

"ఇప్పుడు చెప్పు నువ్ నిజంగా ఆత్మహత్య చేసుకుంటావా?" పవన్ అలా అడుగుతుంటే మూసుకున్న నా కళ్లు తెరుచుకున్నాయ్.

"న్నో.." అన్నాడు అరిచినట్టు.

"దట్స్ గుడ్" అంటూ పవన్ నా భుజం మీద చరిచి మరో చిన్న కాగితాన్ని నా చేతికందించాడు.

నిర్ఘాంతపోయాన్నేను.

అది రెండు లక్షల రూపాయలకు నా పేరిట రాసున్న చెక్కు.

"పవన్..." అన్నాను విభ్రాంతిగా.

"అది నా ఇంటి కోసం దాచుకున్న డబ్బులోంచి తీసిస్తున్నాను. గాబరా పడకు నీ అప్పులన్నీ తీర్చేసుకుని ఇక నుంచైనా ప్రశాంతంగా బ్రతుకు"

"మరి నీ అప్పు?" కృతజ్ఞత కళ్ల వెంబడి కన్నీటి రూపంలో కారిపోతుంటే పూడుకుపోయిన నా కంఠంలోంచి ఆ అయిదు అక్షరాలు మాత్రమే అతికష్టమ్మీద బయటికొచ్చాయ్.

"నీకు కలిగినప్పుడు తీర్చు" అని వాడంటుంటే నేను బావురుమని ఏడ్చేశాను.